క్లుప్తంగా

నేడు దివ్యాంగులకు బస్‌పాస్‌ల జారీ

మణికొండ: దివ్యాంగులకు ఆర్టీసీ బస్‌పాస్‌లు శుక్రవారం మెహిదీపట్నంలో జారీ చేయనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు బస్‌పాస్‌ల జారీ కొనసాగుతుందన్నారు. దివ్యాంగులు బస్‌పాస్ పొందేందుకు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఐడీ కార్డులతో పాటు సర్వీసు చార్జీ రూ. 50లు చెల్లించాలన్నారు. మెహిదీపట్నం డిపో పక్కనున్న బస్‌పాస్ కౌంటర్‌లో బస్‌పాస్‌లను జారీ చేస్తామన్నారు.

'నిషా'చరులకు జైలు శిక్ష

రాజేంద్రనగర్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 9 మందికి కోర్టు జైలు శిక్ష విధించింది. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 31 మందిపై రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసులు నమోదు చేశారు. నిందితులను గురువారం న్యాయ స్థానం ఎదుట ప్రవేశపెట్టారు. పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నజీరుద్దీన్ షా నిందితులకు జైలు శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. ఐదుగురికి మూడు రోజుల చొప్పున, ఇద్దరికి నాలుగు రోజుల చొప్పున, ఇద్దరికి ఐదు రోజుల ప్రకారం జైలు శిక్ష విధించారు. మిగతా వారికి జరిమానా విధించారు. జైలు శిక్ష విధించిన వారిని రిమాండ్‌కు తరలించామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వివరించారు.

నిబంధనలు పాటించకుంటే ట్రేడ్ లైసెన్సుల రద్దు

ఏఎంహెచ్‌వో డాక్టర్ ఆంజనేయులు



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మాంసం విక్రయదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఏఎంహెచ్‌వో ఆంజనేయులు పేర్కొన్నారు. మాంసం వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయరాదని.. ఇష్టారాజ్యంగా వ్యర్థాలను పారవేస్తే సంబంధిత వ్యాపారుల ట్రేడ్ లైసెన్సులను రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ అంశాలపై వ్యాపారులకు అవగాహన కల్పించినట్లు ఆంజనేయులు స్పష్టం చేశారు. సులేమాన్ నగర్, శాస్త్రీపురం, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్ డివిజన్‌ల పరిధిలో మాంసం, చికెన్ సెంటర్ల వ్యాపారులతో సమావేశం నిర్వహించామన్నారు. వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలు, ఖాళీ ప్రదేశాల్లో వెదజల్లవద్దని సూచించామన్నారు. దుకాణాల వద్ద ఉండే వీధి కుక్కలకు వ్యర్థాలను వేయవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. దుకాణాల వద్ద వీధి కుక్కలు ఉంటే వాటిని తరిమివేయాలని తెలిపామన్నారు. వ్యర్థాలను రోజూ తమ ప్రాంతానికి వచ్చే చెత్త సేకరణదారులకు అందించాలని సూచించామన్నారు. నిబంధనలను ఎవరైనా దిక్కరిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వారి ట్రేడ్ లైసెన్స్‌ను రద్దు చేయడంతోపాటు అపరాధ రుసుము విధిస్తామని ఆయన హెచ్చరించారు.

కళ్లల్లో కారం చల్లి.. కత్తులతో దాడి చేసి

- యువకుడికి తీవ్రగాయాలు
- పాతకక్షలే కారణం



గాయపడిన సోహెల్

రాజేంద్రనగర్: ఓ యువకుడి కళ్లల్లో కారం చల్లి కత్తులతో దాడి చేసిన సంఘన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోహెల్ అతావుల్లా క్యాటరింగ్ పని నిర్వహిస్తుంటాడు. అతడికి ఇదే ప్రాంతానికి చెందిన హుస్సేన్ కుటుంబ సభ్యులతో పాటు అతడి మేనమామలతో పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జరిగిన గొడవల్లో ఇరు కుటుంబాలకు చెందిన ఇద్దరు మృతి చెందారు. 2011, 2018లలో జరిగిన ఈ హత్య కేసులు ప్రస్తుతం కోర్టులో నడుస్తున్నాయి. బుధవారం రాత్రి సోహెల్ టోలిచౌకీ నుంచి బైక్‌పై ఇంటికి వస్తుండగా, ఆరాంఘర్‌లోని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్దకు రాగానే హుస్సేన్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తులు సోహెల్‌పై కారం చల్లి కత్తులతో దాడి చేశారు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. దాడిపై తన కుటుంబసభ్యులకు సమాచారం అందించిన సోహెల్ నేరుగా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు మాట్లాడుతూ ఇరుకుటుంబాల మధ్య పాతకక్షలు ఉన్నట్లు తెలిపాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించామని అయితే ఆ ప్రాంతంలో దాడి జరిగి ఆనవాళ్లు లేవన్నారు. బాధితుడు చెబుతున్న వివరాల్లో పొంతన లేదని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తగ్గనున్న పన్నుల భారం!

- నిర్మాణం వ్యయం రూ. 2200 నుంచి రూ. 1100లకు తగ్గింపు
- గతంలో జరిగిన తప్పును సరిదిద్దిన అధికారులు
- ఫలించిన ఫెడరేషన్ పోరాటం



మణికొండ మున్సిపల్ కమిషనర్‌కు కృతజ్ఞతలు చెబుతున్న ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ సభ్యులు

మణికొండ: మూడు సంవత్సరాలుగా మున్సిపాలిటీలలో తప్పుగా విధిస్తున్న పన్ను మదింపును ఎట్టకేలకు మున్సిపల్ శాఖ సరిదిద్దనుంది. గ్రేటర్ హైదరాబాద్ కన్నా అధికంగా మున్సిపాలిటీలలో పన్నులు విధిస్తున్నారని, ఇంతేసి పన్నులు ఎలా చెల్లించాలని మణికొండ మున్సిపాలిటీ వాసులు గతంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దకాలం కింద పన్ను మదింపు చేసిన వాటికి సమస్య లేకపోగా ఐదు సంవత్సరాల క్రితం నుంచి మదింపు చేసిన వాటికి ఏకంగా వేలల్లో ఇంటి పన్ను వచ్చింది. మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడలో అత్యధికంగా ఇలాంటి పొరపాట్లు జరిగాయి. దాంతో మణికొండ మున్సిపాలిటీ ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ నాయకులు గతంలో హైకోర్టును సైతం ఆశ్రయించారు. దాంతో మేల్కొన్న మున్సిపల్ శాఖ అధికారులు ముందు సరిగానే విధిస్తున్నామని వాదించినా ఎట్టకేలకు జరిగిన తప్పును తెలుసుకున్నారు.

నిర్మాణ వ్యయంతో వ్యత్యాసం...

మున్సిపాలిటీలలో ఓ స్థలం రిజిస్ట్రేషన్ విలువతో పాటు నిర్మాణానికి అయ్యే ఖర్చును వేసి దానిపై ఇంత శాతం పన్ను అని విధించే వారు. అందులో భాగంగా రిజిస్ట్రేషన్‌ల విలువలు ఎప్పటికప్పుడు మారటం, దాన్ని వెంటనే వీరు తీసుకోవటం జరిగిపోయేది. అదే నిర్మాణ వ్యయం ప్రస్తుతం ప్రభుత్వమే చదరపు అడుగుకు రూ. 1100లుగా పలు నిర్మాణాలకు చెల్లిస్తుంది. అదే మున్సిపాలిటీలు మాత్రం రూ. 2200ల చొప్పున వేసి ఇంటి పన్నులను లెక్కించారు. దాంతో ప్రతి డబుల్ బెడ్ రూం ఇంటికి వేలల్లో ఇంటి పన్ను పెరిగిపోయింది. ప్రస్తుతం దాన్ని రూ. 1100లకు తగ్గించటంతో ఒక్కో డబుల్ బెడ్ రూం పోర్షన్‌లపై రూ. 2 వేల వరకు తేడా వస్తుందని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వి. ఆంజనేయులు తెలిపారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీలకు వర్తిస్తుందన్నారు.

కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఫెడరేషన్...

మున్సిపాలిటీల్లో మూడేళ్లుగా విధిస్తున్న పన్నులపై అభ్యంతరాలు, సమీక్షలు, పోరాటాలు, కోర్టు కేసులు లాంటి పద్ధతిలో ప్రయత్నించిన ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ నాయకులు ఎట్టకేలకు మణికొండ మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్ కుమార్ దాన్ని గుర్తించి సరిదిద్దటంతో ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు డి.సీతారాం, ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులు మాట్లాడుతూ... సమర్థులైన అధికారులు ఉంటే సమస్యలు ఇలా పరిష్కారం అవుతాయన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టనున్న రోడ్ల వెడల్పు, పందెన్‌వాగుపై కాంక్రీట్ స్లాబ్ నిర్మించటం, శివసాయికాలనీకి రహదారి నిర్మించటం, వీధి కుక్కల సమస్య తీర్చాలని కమిషనర్‌ను కోరినట్టు వారు పేర్కొన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భారత్'లో నమోదు చేసుకోవాలి



ఆయుష్మాన్ భారత్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి

రాజేంద్రనగర్: దేశ ప్రజల శ్రేయస్సు కోసం భారత ప్రధాని నరేంద్రమోదీ అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారని చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. అత్తాపూర్‌లో ఆయుష్మాన్ భారత్ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడతూ ఆయుష్మాన్ భారత్‌తో ప్రజలకు ఎంతో మేలు కలగనుందన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి 5 లక్షల వరకు కేంద్ర హెల్త్ ఇన్స్యూరెన్స్ లభిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా ప్రైవేటు ఆసుపతురల్లో కార్పొరేట్ చికిత్స అందించడం జరుగుతుందన్నారు. తెల్లరేషన్ కార్డు దారులంతా తమ పేర్లను ఆయుష్మాన్ భారత్‌లో నమోదు చేసుకోవాలన్నారు. పేద ప్రజల కోసం ప్రవేశపెడుతున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్, మూసీ ప్రక్షాళన కమిటీ కన్వీనర్ సనివెల్లి జయానంద్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

రాజేంద్రనగర్: సులేమాన్‌నగర్ డివిజన్‌కు చెందిన మైనార్టీ మహిళలు, యువకులు పెద్ద ఎత్తున గురువారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ ముర్తుజా ఆలీ, మహ్మద్ గౌస్ ఆధ్వర్యంలో దాదాపు వంద మంది ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పార్టీ పటిష్టంగా ఉందన్నారు. మరో రెండు దశాబ్దాలపాటు పార్టీ అధికారంలో ఉండటం ఖాయమన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

నేటి నుంచి బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల గ్రామంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలను నిర్వహించనున్నారు. ఉత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం నూతనంగా ప్రతిష్ఠించే బొడ్రాయిని గ్రామంలో ఊరేగించి కార్యస్థలానికి చేర్చారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశణం, కంకణధారణ, గోమాత పూజ, ధ్వజారోహణం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, అంకురారోపణం, వాస్తు క్షేత్రపాలక, నవగ్రహ, మాతృకా ప్రదీన కళశ స్థాపన, గణపతి హోమం, విగ్రహాల శుద్ధి పూజలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు 108 వృత్తికా కళశాలతో మహాస్నపనం, సాయంత్రం 6 గంటలకు యజ్ఞం, 7 గంటలకు ధాన్యాదివాసం, ధనాదివాసం, శయ్యాదివాసం పూజలు ఉంటాయన్నారు. శనివారం ఉదయం 8.50కు యంత్ర ప్రతిష్ఠ, బొడ్రాయి ప్రతిష్ఠ నిర్వహిస్తామన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొనాలని కోరారు.

రాజేంద్రనగర్ సర్కిల్‌లో భారీ వర్షం





రోడ్లపై నిలిచిపోయిన వరద నీరు

రాజేంద్రనగర్: కొన్ని రోజులుగా ఎండ, ఉక్కపోతతో సతమతం అవుతున్న రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజలు గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో సేదతీరారు. ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బంది పడ్డ ప్రజలు మధ్యాహ్నం 2 గంటలకు వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉరుములు, మెరుపులు, గాలి దుమారంతో దాదాపు గంటన్నర పాటు భారీ వర్షం కురిసింది. దట్టమైన మేఘాలు అలుముకోవడంతో చీకటి నెలకొంది. ప్రధాన రహదారులపై వాహనాదారులు తమ వాహనాల లైట్లతో వాహనాలు నడిపించడం కనిపించింది. భారీ వర్షానికి బుద్వేల్ అండర్ బ్రిడ్జీ, ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జీ, శివరాంపల్లి ఎన్‌పీఏ చౌరస్తా, బెస్ట్‌ప్రైజ్, ఉప్పర్‌పల్లి 193 పిల్లర్‌తో పాటు పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది.

పొట్టి శ్రీరాములుకు నివాళి

మణికొండ: ఆంధ్రప్రదేశ్ అవతరణకు తన ప్రాణాలను సైతం త్యజించిన పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా మణికొండలో వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని క్వార్టర్స్ వద్ద నివాళులు అర్పించిన అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు కె.నిరీష, కార్యదర్శి వంశీకృష్ణ, కోశాధికారి రామ్‌సురేష్, జోన్ చైర్మన్ జి.నవీన్, సి.కె.మూర్తి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న వాసవి కపుల్స్ క్లబ్ ప్రతినిధులు

ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ డ్రైవ్

బండ్లగూడ: ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుటామని నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ హెచ్చరించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని షాదన్ మెడికల్ కళాశాల సమీపంలో గురువారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పెండింగ్ చలానాలను వెంటనే చెల్లించాలని సూచించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ... ట్రాఫిక్ రూల్స్ అందరూ తప్పకుండా పాటించాలన్నారు. రాంగ్ రూట్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్ చేయవద్దు అన్నారు. ద్విచక్ర వాహనాదారులకు హెల్మెట్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ట్రాఫిక్ రూమ్స్ పాటించని కొంతమంది వాహనాదారులకు చలానాలను విధించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

రాజేంద్రనగర్: లబ్ధిదారులందరికీ సీఎం సహాయ నిధి చెక్కులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతానికి చెందిన బాబుకు సీఎం సహాయ నిధి నుంచి రూ. 60 వేల చెక్కును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొంది సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తులు చేసుకున్న వెంటనే నిధులు మంజూరు చేయిస్తున్నామన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.



చెక్కును లబ్ధిదారుడికి అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

శంషాబాద్: మెరుగైన వైద్యం కోసం పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఓ వరంలా ఆదుకుంటోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. పిల్లోనిగూడ, పెద్ద గోల్కొండ, రషీద్‌గూడ తండా, హమీదుల్లానగర్ తదితర గ్రామాలకు చెందిన పలువురికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ. 3.90 లక్షల నిధులకు సంబంధించి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ, జెడ్పీటీసీ తన్వీ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కె.చంద్రారెడ్డి, సర్పంచ్ సతీస్ యాదవ్, ఎంపీటీసీ డి.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై విద్యార్థులకు అవగాహన

రాజేంద్రనగర్: శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎంసీ, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ నేతృత్వంలో ప్రకృతి వైపరీత్యాలు, తరుణోపాయం, సహాయక చర్యలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గాలి, వానలకు చెట్లు విరిగిపడటం, వర్షాలకు ఇళ్లు కూలిపోవడం, నాలాలు తెరుచుకోవడం, మనుషులు, జంతువులు నాలాల్లో పడిపోవడం, చెరువుల్లో, నీటి కుంటల్లో పడిపోయినప్పుడు, ఏదైనా అగ్ని ప్రమాదం సంభవించడం తదితర ప్రకృతి వైపరీత్యాలు, దుర్ఘటనలు సంభవించినప్పుడు 9000113667 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని రెస్క్యూ టీమ్ కోఆర్డినేటర్ రవియాదవ్ వివరించారు. వెంటనే రెస్క్యూ టీమ్ వచ్చి సహాయక చర్యలు చేపడుతుందన్నారు. శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్, ఉపాధాయ్యులు, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ టీమ్ సభ్యులు మోహన్‌కుమార్, శంకర్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు?

- రెచ్చిపోతున్న వసూల్ రాజాలు
- కొమ్ముకాస్తున్న కౌన్సిలర్‌లు
- బేజారెత్తిపోతున్న అధికారులు
- నార్సింగికి వచ్చేందుకు జంకుతున్న అధికారులు



నార్సింగి మున్సిపల్ కార్యాలయం

మణికొండ: మున్సిపాలిటీల్లో పేరుకుపోయిన అవినీతిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నూతన మున్సిపల్ చట్టాన్ని తెచ్చింది. అందులో అధికారులు, ప్రజాప్రతినిధులకు స్పష్టమైన నియమ నిబంధన రేఖలు పెట్టింది. అయినా నార్సింగి మున్సిపాలిటీలో అవేమీ పట్టించుకోవటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ చట్టం ప్రకారం ప్రజాప్రతినిధులు కేవలం మున్సిపాలిటీ పరిధిలో జరగాల్సిన అభివృద్ధి పనులపై తీర్మానాలు చేయటం, తమ వార్డులలో హరితహారాన్ని విజయవంతం చేయటం, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు వారధిగా ఉండాలని మాత్రమే ఉంది. మున్సిపాలిటీలలో వస్తున్న నిర్మాణాలు, కూల్చివేతలు, అనుమతులు జారీ చేయటం లాంటి పనులన్నీ అధికారులే చేయాలని స్పష్టంగా ఉంది. అందుకు భిన్నంగా కొందరు కౌన్సిలర్‌లు, మహిళా కౌన్సిలర్‌ల భర్తలు తమకు లేని అధికారాలను చెలాయిస్తూ అక్రమ నిర్మాణాలకు కొమ్ము కాస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి భవనానికి తమకు చెప్పాకనే అనుమతులు ఇవ్వాలని, తాము చెప్పిన వారికే ఎన్‌ఓసీలు, అభివృద్ధి పనులు, పబ్లిసిటీ బోర్డులు ఇవ్వాలని హుకుం జారీ చేస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రజావసరాలకు వదిలిన భూములను పరిరక్షించాల్సిన కొందరు ప్రజాప్రతినిధులే వాటిని చెరపట్టేందుకు గతంలో ప్రయత్నాలు చేశారు. పలు చోట్ల పార్కులు, రోడ్లు, శ్మశానవాటిక స్థలాలను సైతం కొందరు ప్రబుద్ధులు కబ్జాలకు యత్నించటం చూస్తున్న ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ఆన్‌లైన్ ద్వారా వచ్చే అనుమతులు వారికి నిర్ణయించిన సమయంలోపు అధికారులే ఇవ్వాలి. అందుకు భిన్నంగా కొందరు కౌన్సిలర్ ఎలాంటి అనుమతులు వచ్చినా ముందుగా అవి మాకు చూయించిన తరువాత వారితో మేము మాట్లాడాకనే అనుమతులు ఇవ్వాలనే షరతులు పెడుతున్నట్టు సమాచారం. సకాలంలో వాటికి అనుమతులు ఇవ్వకపోవటంతో అధికారులకు జరిమానాలు సైతం పడుతున్నట్టు సమాచారం. అలా అనుమతులు ఇప్పించాక బిల్డర్‌లు, నిర్మాణదారులతో ములాఖత్ అయి మీ ఇష్టం వచ్చినన్ని అంతస్తులు నిర్మించుకోండని హామీలు ఇస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. దాంతో మున్సిపాలిటీ పరిధిలో జీ-ప్లస్ 4 అంతస్తులకు అనుమతులు తీసుకుని ఏకంగా ఆరు, ఏడు, ఎనిమిది అంతస్తుల వరకు నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాంటి వాటికి నిబంధనల ప్రకారం ఎన్‌ఓసీ ఇవ్వటం, మార్టిగేజ్‌ను రిలీజ్ చేసే అవకాశం లేకపోయినా కొందరు కౌన్సిలర్‌లు అధికారులపై ఒత్తిడి చేసి తప్పులు చేయిస్తున్నట్టు వారు ఆరోపిస్తున్నారు.
- నార్సింగి మున్సిపాలిటీలో అధికారులపై సైతం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేరు చెప్పి ఒత్తిడులు తెస్తుండటంతో ఇక్కడ పనిచేసే అధికారులు మరో చోటుకు బదిలీ చేయించుకునే ప్రయత్నంలో ఉన్నట్టు తెలిసింది. కౌన్సిలర్‌ల మాటలు విని తప్పులు చేస్తే అవి తాము ఎక్కడకు వెళ్లినా వెంటాడతాయనే భయంతో వారు కొన్ని తప్పించుకుంటున్నట్టు సమాచారం.
- కౌన్సిలర్‌ల ఒత్తిడితో మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడి పడితే అక్కడ సైన్ బోర్డులకు అనుమతులు ఇవ్వటంతో ఇటీవల మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ వాటిని చూసి మున్సిపల్ కమిషనర్‌ను చివాట్లు పెట్టి వెంటనే తొలగించాలని ఆదేశించారు.
- గతంలోనూ హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు తెచ్చుకున్న బడా బిల్డర్‌లను స్థానిక కౌన్సిలర్‌లు రింగ్‌గా ఏర్పడి వారిని డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు గురిచేయటంతో వారు ఏకంగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదు చేశారు.
- దాంతో హెచ్‌ఎండీఏ ఇచ్చే అనుమతులకు స్థానిక మున్సిపాలిటీల అనుమతులు అవసరం లేదని నిబంధనను తెచ్చారు.
- నార్సింగిలో పనిచేస్తున్న ఓ అధికారి వారానికి ఒక్కరోజే కార్యాలయానికి వస్తుండగా మరో అధికారి కార్యాలయంలోకన్నా బయట తిరిగేందుకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు కార్యాలయ సిబ్బంది బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు మాత్రం వీరు చేసే తప్పులను ఎంచుతూ సమయం వచ్చినపుడు బయటపెట్టేందుకు సిద్ధమవుతున్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

మణికొండ: అన్ని వర్గాల వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ కోకాపేటకు చెందిన కె.రమేష్‌కు రూ. 60 వేలు, డి.పద్మమ్మకు రూ. 15,500ల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదలకు ప్రమాదాలు జరిగినా, ఆరోగ్యాలు దెబ్బతిని ఆస్పత్రులలో చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కోకాపేట కౌన్సిలర్ జి.శివారెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపల్ ఉపాధ్యక్షుడు ఆర్. విశ్వనాథ్, నాయకులు యాదగిరి, సునీల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పరిపూర్ణ ఆరోగ్యం

రాజేంద్రనగర్: చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో శ్రేష్టమని బీజేపీ నాయకుడు అంజన్‌కుమార్ అన్నారు. శివరాంపల్లిలో గురువారం మిల్లెట్స్ అల్పాహార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని చిరుధాన్యాలతో తయారు చేసిన అల్పాహారాన్ని భుజించారు. కార్యక్రమంలో హరికిషన్‌జీ, వై.శ్రీధర్, కొమురయ్య, సోల్కర్‌రెడ్డి, పద్మావతి, బాబురావు పాల్గొన్నారు.